క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కోటవురట్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యాబోధన అందుతోందని, అందరి సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధ్యపడుతున్నాయని ప్రిన్సిపాల్ పి.కొండబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కె.బ్రహ్మాజీ, వైస్ చైర్మన్ పి.కుమారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో చదువుపై ఆసక్తి



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచుతున్నాయని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడం సాధన చేయించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ప్రసాదరావు, మస్తాన్ వ్యవహరించారు.

విద్యార్థులకు యోగా తరగతులు



యోగా నేర్పుతున్న యోగా గురువు

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి యోగాభ్యాసం తప్పనిసరిగా నేర్చుకోవాలని యోగా గురువు ఎ.శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు యోగా పై అవగాహన కల్పించారు. మంచి ఆరోగ్యానికి, మనశ్శాంతికి యోగా దోహద పడుతుందన్నారు. అనంతరం భారతం, భగవద్గీత, రామాయణంలో గల పలు అంశాలపై విద్యార్థులకు బోధించారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు పర్యవేక్షించండి



తడిపొడి చెత్తల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మీపతి

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ అయ్యేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని డీఆర్‌డీఏ ఈడీ, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి సూచించారు. గుడివాడ గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. అంగన్‌వాడీ, సచివాలయం, ఉన్నత పాఠశాల, నిర్మాణంలో ఉన్న రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను ఆయన సందర్శించారు. గ్రామ శివారులో ఉన్న తడి, పొడి చెత్తల నిర్వహణ కేంద్రాన్ని వెంటనే వినియోగంలోనికి తీసుకు రావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని అందివ్వాలని చెప్పారు. ఉన్నత పాఠశాలలో నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, ఎంఈవో మూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. తిమ్మరాజుపేటలో శనివారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తుందన్నారు. గ్రామంలోనే సేవలందించే కార్యక్రమం ఎంతో అద్భుతంగా ఉంటుందన్నారు. గతంలో వైద్య సేవలకోసం సుదూర ప్రాంతమైన చూచుకొండకు వెళ్లాల్సి వచ్చేదని, ఇక అలాంటి సమస్యలు లేవన్నారు. డాక్టర్ మానస వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎస్‌ఎం ప్రేమకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండు కళ్లు లాంటివని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు గాంచారన్నారు. మండలంలోని చూచుకొండలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కళ్యాణమండపానికి ఆమె శనివారం స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో కలిసి భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ గోడ , రూ.12 లక్షలతో నిర్మించిన దోబిఖానా, రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఓంశాంతి భవనాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలోని గ్రామాల్లో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తన దత్తత గ్రామమైన గణపర్తితో పాటు చూచుకొండకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ, గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు, మునగపాక ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే రమణమూర్తిరాజును ఎంపీ డాక్టర్ సత్యవతి,విష్ణుమూర్తి దంపతులు ఘనంగా సత్కరించారు.



చూచుకొండలో దోబిఖానా ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి,ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



చూచుకొండలో కళ్యాణమండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రతి ఒక్కరి సంక్షేమం జగనన్న ధ్యేయం

- అవినీతికి తావులేకుండా పథకాల అమలు
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: అర్హులందరికీ అక్రమాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వాడనర్సాపురం గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఏ కుటుంబానికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలకు క్యాలెండర్ విడుదల చేసి ఆ ప్రకారం పథకాలకు సంబంధించిన సొమ్మును జగనన్న బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నారన్నారు. పింఛన్లను ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా అందిస్తున్నామన్నారు. అలాగే ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



వాడనర్సాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

పలువురు ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి నేవీ ప్యాకేజీలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన ప్యాకేజీలు అందేలా చూస్తానన్నారు. భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కారె పైడితల్లికి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తన సొంత నిధులతో రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్‌ఎస్ రాజు, సర్పంచ్ రామారావు, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ భాగ్యవతి పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసుకోండి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సొంతింటి కలను సాకారం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. ఆక్సాహేబుపేటలో వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. లే అవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తెలపాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెటీరియల్ అందుబాటులో ఉందని త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు రాజీవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆక్సాహేబుపేటలో లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

విభేదాలు విడనాడి ఐక్యంగా పనిచేయండి



గంటవానిపాలెం నేతల చేతులను కలుపుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : గ్రామాల్లో నేతలు విభేదాలు విడనాడి పార్టీ అధికారంలోకి వచ్చేలా పాటుపడాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా గెలవాలన్నారు. గంటవానిపాలెంలో వైఎస్సార్‌సీపీలో మాజీ, తాజా సర్పంచ్‌ల మధ్య ఉన్న విభేదాలను పక్కనపెట్టాలని కోరుతూ ఇరువురు నేతల చేతులను ఆయన కలిపారు.గంటవానిపాలెం అభివృద్ధికి ఇద్దరూ కలిసి పనిచేయాలన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి

నక్కపల్లి : మండల కేంద్రంలో మండల ప్రత్యేకాధికారి దయామణి శనివారం పర్యటించారు. నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. రోగుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఓపి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. 50 పడకల స్థాయికి పెంచడంతో సదుపాయాలు, పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని కూడా నియమించడం జరిగిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలని రోగులకు సూచించారు. అనంతరం ఆమె జగనన్న లేఅవుట్లను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. తదుపరి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదులను మీ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు,తహసీల్దార్ నీరజ, ఈవో పీఆర్‌డీ వెంకటనారాయణ,పోలీస్‌సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి దయామణి

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కోటవురట్ల: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని చినబొడ్డేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ పైల శివరామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు నేరాలు, మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

కోటవురట్ల: ప్రతీ మహిళ మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఏఎస్‌ఐ గంగరాజు సూచించారు. కె.వెంకటాపురం శివారున ఉన్న ప్రకాష్ ఎక్స్‌పోర్ట్సు జీడిపిక్కల ఫ్యాక్టరీలో మహిళా కార్మికులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. దొంగతనాలు జరిగే విధానం, అప్రమత్తత వివరించారు. దొంగ సొత్తును కొనుగోలు చేయకూడదని, అలా చేస్తే చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫ్యాక్టరీలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 100, 112 నంబర్లకు కాల్ చేసి ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జ్ హెచ్‌సీ శ్రీనివాసరావు, సిబ్బంది భరతుడు, యుగంధరరావు, ఫ్యాక్టరీ మేనేజర్ రాకేష్‌కుమార్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ గంగరాజు

మెరుగైన వైద్య సేవలందించాలి

రాంబిల్లి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు ఆదేశించారు. రాంబిల్లి పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు వైద్యసేవలందించాలని సూచించారు. అనంతర ఆయన కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకం కావాలంటే ప్రజలు ముందుగా గ్రామ వలంటీర్ వద్దకు ప్రజలు వెళుతున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరం సచివాలయంలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే రికార్డు స్థాయిలో గ్రామ వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్రా, సేవా రత్నా, సేవా మిత్ర బిరుదులు ఇచ్చి ధృవీకర పత్రాలు అందించారన్నారు. సేవా వజ్రా పురస్కారానికి ఎంపికైన బొలిశెట్టి దుర్గా భవానీని శాలువాతో సత్కరించి ధృవీకరణ పత్రం అందజేశారు. సేవారత్న పురస్కారాలకు ఎంపికయిన రజిని, రోహిత్,హేమలత, అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌రావులతో పాటు మరికొంత మంది సేవా మిత్రలను సత్కరించి ధృవీకరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ ఎంపీపీ, చిన్నగుమ్ములూరు ఎంపీటీసీ అయిన బొలిశెట్టి శారదాకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, పాలపర్తి పాపారావు,కొప్పిశెట్టి సత్యం,దారబోయిన గణేష్, కోశెట్టి వెంకటరమణ, మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు శానాపతి రాము,బైపా శ్రీనివాసరావు వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న పాల్గొన్నారు.



సేవా వజ్రకు ఎంపికైన దుర్గాభవానీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మీ కష్టం విలువ తెలుసు

కూలీల కష్ట నష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: 'కష్టం విలువ నాకు తెలుసు, మీ కష్టాలను చూస్తుంటే నా తల్లిదండ్రులు నన్ను పెంచిన రోజులు గుర్తుకు వస్తున్నాయి. కూలి రేటు పెంపుతో పాటు పనుల వద్ద తాగునీరు ఇతర వసతులు కల్పించేలా పంచాయతీరాజ్ కమిషనర్‌తో మాట్లాడుతా' అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వేతనదారులకు హామీ ఇచ్చారు. మండలంలోని దార్లపూడి, పెదగుమ్ములూరు గ్రామాల్లో ఉపాధి కూలీల వద్దకు శనివారం ఆయన వెళ్లారు. మట్టి తట్టను నెత్తిన మోసి కాసేపు కూలీ అవతారం ఎత్తారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా వారితోపాటు చెరువులో కూర్చొని ముచ్చటించారు. ఉపాధి పనుల్లో కలిగి కష్టాలతోపాటు వారి ఇంటి అవసరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇళ్ల రాకపోయినా, ఇంటి స్థలం లేకపోయినా వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథ్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొణంకోట నీలేంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, చల్లపల్లి సత్యనారాయణ, కొర్రెడ్డి బాబి, కోన బాబూరావు, వైబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.



కూలీలతోపాటు నేలపై కూర్చుని మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో పరిశుభ్రత

కోటవురట్ల: కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పాఠశాలకు వెళ్లే దారి చెత్తతో నిండిపోవడంతో పాటు డ్రైనేజీలో పూడిక పెరిగిపోవడంతో సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుకు దోహదపడాలని కోరారు.

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం

మునగపాక : పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని ప్రభుత్వ ఉపాధ్యాయులు దేముడుబాబు, రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గణపర్తి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలతో పాటు ఎన్నో విజ్ఞానదాయక పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయాధికారి లంబా అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారిశెట్టి వెంకటరమణ, చదరం లోవ పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్న సేవలో టీవీ ఆర్టిస్టులు

నక్కపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న నక్కపల్లి మండలం ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తమై కల్కి అవతారంలో వెలసిన వేంకటేశ్వర స్వామివారిని టీవీ నటి యోధ కుటుంబం శనివారం దర్శించుకుంది. వీరు ముందుగా కల్కి వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వెంకటేశ్ శేషాచార్యులు, బాగవతం గోపాలాచార్యుల ఆధ్వర్యంలో గోదాదేవి సన్నిధిలో వేద ఆశీర్వచనం, శేషవస్త్రాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నటి యోధ తండ్రి, నటుడు కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ఒకసారి స్వామివారిని దర్శించుకున్నామన్నారు. స్వామివారి దయతోనే తాము నూతన ఇంటి నిర్మించుకుని, మరలా కుటుంబ సమేతంగా వచ్చామన్నారు. ఉపమాక వెంకటేశ్వర స్వామి ఎంతో మహిమ గలవారన్నారు. ఆయన ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు.



నటి యోధ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అర్చకులు

చూచుకొండ సర్పంచ్‌కు ఘన సత్కారం

మునగపాక : చూచుకొండ పంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా శనివారం సర్పంచ్ దొడ్డి సూరప్పారావుకు ఘన సత్కారం నిర్వహించారు. చూచుకొండ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఉన్నతాధికారులు జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. క్లీన్ విలేజ్ కార్యక్రమంలో చూచుకొండకు సర్పంచ్ సూరప్పారావు అందించిన సేవలకుగాను అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు శాలువా కప్పి సత్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించడంలో సూరప్పారావు అందించిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ పాల్గొన్నారు.



చూచుకొండ సర్పంచ్ సూరప్పారావును సత్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

యలమంచిలి : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను యలమంచిలి పట్టణంలో శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. యలమంచిలి ప్రధాన రహదారుల్లో ఉన్న యాచకులకు మధ్యాహ్నం ఆహార ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం

ఎస్.రాయవరం : ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని రేవుపోలవరంగ్రామంలో అభిమానులు రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ఫ్యాన్స్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు.

జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలతో రైతులకు మేలు

యలమంచిలి : జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడనున్నాయని 1వ వార్డు కౌన్సిలర్ కర్రి లక్ష్మి అన్నారు. జగనన్న భూరక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు పాసుపుస్తకాలను స్థానిక కౌన్సిలర్ కర్రి లక్ష్మి, యలమంచిలి పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ ఆధ్వర్యంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కర్రి లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం ద్వారా లక్షలాది ఎకరాల్లో రీ సర్వే ద్వారా చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు తీరనున్నాయని అన్నారు. కార్యక్రమంలో సోమలింగపాలెం సచివాలయ కన్వీనర్ పిళ్లా గోవింద అయ్యలనాయుడు, దొడ్డి మారునాయుడు మాస్టార్,యల్లపు భూలోకనాయుడు, ఆర్‌ఐ రాంబాబు, వీఆర్‌వో సుబ్రమణ్యం గ్రామంలో రైతులు పాల్గొన్నారు.



సోమలింగపాలెంలో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ కర్రి లక్ష్మి

స్వచ్ఛ సంకల్పంలో భాగస్వాములు కండి

యలమంచిలి : పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు,అర్రెపు గుప్త అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్2.0మేరా లైఫ్ మేరా స్వచ్ఛ సహర్ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి పట్టణంలో పాత రైతుబజార్ వద్ద ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులు, వినియోగాన్ని విడనాడాలని, ప్లాస్టిక్ నివారణ దిశగా స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కావాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రీసైకిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరావు,అర్రెపు గుప్త

మహిళల ఆర్థిక అభివృద్ధికి అమూల్ కేంద్రాలు దోహదం

మునగపాక : మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అమూల్ పాలకేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ అన్నారు. అమూల్ పాల కేంద్రాలు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం మునగపాకలో పాలు పోసే రైతులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలే పాలను సరఫరా చేస్తూ వచ్చే ఆదాయంపై కుటుంబాలను పోషించుకోవడం శుభ పరిణామమన్నారు. పశువుల కొనుగోలులో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.



పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

సూక్ష్మ నీటి సేద్యంతో అధిక దిగుబడి

కోటవురట్ల : సూక్ష్మ సాగు నీటి సేద్యంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యపడతాయని ఏపీఎంఐపి పీడీ జి.వి.లక్ష్మి అన్నారు. మండలంలోని యండపల్లి, బోడపాలెం, కోటవురట్ల, టి.జగ్గంపేట గ్రామాలలో ఏపీఎంఐపి అధికారుల బృందం శనివారం పర్యటించింది. రైతులతో మాట్లాడి, పొలాల్లో అమర్చిన బిందు సేద్యం పరికరాలు, స్ప్రింకర్లను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రాయితీపై అందిస్తున్నారన్నారు. 2022–23 సంవత్సరంలో జిల్లాలో 832 హెక్టార్లు బిందు సేద్యంలో సాగవుతున్నట్టు తెలిపారు. 2023–24 సంవత్సరంలో 1200 హెక్టార్లు లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. బిందు సేద్యం వల్ల మొక్కకు కావలసిన నీటిని బొట్టు బొట్టుగా నేరుగా మొక్కకు అందించడం వల్ల నీటి వృథా ఉండదన్నారు. దీని వల్ల 50 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చన్నారు. నీటితో పాటు సూక్ష్మ పద్ధతిలో ఎరువులను కూడా అందించడం వల్ల ఖర్చు తగ్గుతుందన్నారు. డ్రిప్ పద్ధతిలో పండ్ల తోటలు, కూరగాయలు, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయవచ్చని తెలిపారు.



బిందు సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మి